క్లుప్తంగా

చెల్లంనాయుడువలసలో సీసీరోడ్డు నిర్మాణం



చెల్లంనాయుడువలసలో నీలాటి రేవుల్లో వేస్తున్న సీసీరోడ్డు

సీతానగరం: మండలంలోని చెల్లంనాయుడువలసలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ మేరకు ఏఈ జి.చంద్రమౌళి మంగళవారం మాట్లాడుతూ చెల్లంనాయుడువలస గ్రామం నుంచి సువర్ణముఖి నదికి ప్రజలు వెళ్తున్న రహదారి అధ్వానంగా ఉన్నందున పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. అలాగే మండలంలోని గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు దశల వారీగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. బూర్జ సచివాలయం, సీసీ కాలువలు, సీసీరోడ్డు పనులు పూర్తి కావచ్చాయన్నారు.

సచివాలయాల సందర్శన



మామిడిపల్లి సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి, అన్నంరాజు వలస సచివాలయాలను ఎంపీడీఓ ఫణీంద్ర కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి విషయమై సిబ్బంది అనుసరిస్తున్న విధివిధానాలు, జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. అలాగే ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని సిబ్బందికి సూచిస్తూ సమయపాలన పాటించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు.

నేడు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



సీతమ్మ తల్లి విగ్రహానికి కుంకుమ పూజచేస్తున్న భక్తులు

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట బుధవారం జరగనుంది. విగ్రహ ప్రతిష్టకు ముందుగా మంగళవారం గ్రామప్రజలు హైందవ సైన్యం ఆధ్వర్యంలో సీతమ్మ తల్లి విగ్రహానికి కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే పాలాభిషేకం చేశారు.

గ్రామానికి చేరుకున్న బంగారమ్మ



అమ్మవారికి పూజచేస్తున్న పూజారి కుటుంబీకులు

మక్కువ: మండలంలోని కొండబుచ్చమ్మపేట గ్రామదేవత బంగారమ్మ తల్లిని మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ భక్తులు గ్రామంలోకి సోమవారం రాత్రి ఆహ్వానించారు. గ్రామం సమీపంలోని పూజారి కుటుం బసభ్యులు పూజలు నిర్వహించారు. ఏడేళ్ల తరువాత గ్రామంలో బంగారమ్మతల్లి గ్రామదేవత పండగ జరగనుండడంతో, ఎక్కడెక్కడో నివాసముంటున్న గ్రామస్తులు గ్రామానికి చేరుకున్నారు. కాళ్లనొప్పుల కారణంగా గద్దెవద్ద అమ్మవారు మంగళవారం విశ్రాంతి తీసుకున్నారు. బుధవారం అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగిస్తారు. ఈనెల 25,26,27వతేదీల్లో అమ్మవారి పండగను భక్తులు జరుపుకుంటారు.

పక్కాగా పౌష్టికాహారం పంపిణీ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు పక్కాగా పంపిణీ చేయాలని భద్రగిరి ఐసీడీఎస్ పీవో సుశీలదేవి సూచించారు. మండలంలోని రేగిడి, బెల్లిడి గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించిన ఆమె తొలుత ఆయా కేంద్రాల్లోని చిన్నారులఎత్తు, బరువులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్రీ స్కూల్ నిర్వహణపై ఆరాతీశారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు.

ఎమ్మెల్యే జోగారావుకు
కాశీపేట గ్రామస్తుల అండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు తామంతా అండగా ఉంటామంటూ సీతానగరం మండలంలోని కాశీపేట గ్రామస్తులు సంఘీభావం తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామానికి చెందిన సర్పంచ్ టి. ధనుంజయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ ధనుంజయ్, పరువాడ వెంకటేష్ (వైస్‌ఎంపీపీ కుమారుడు), విశ్రాంత వీర్వో ఎం.ప్రభాకర్ నాయుడు, రెడ్డి పకీరునాయుడు, దత్తి సింహాచలం, మడక వెంకటేశ్వరరావు, జి.రాజీవ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలిసి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్ల తామంతా తమ పిల్లలను చదివించుకోగలుగుతున్నామని సంతోషం వెలిబుచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలంతా ఐకమత్యంగా ఉన్నందున సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. జగనన్నను నమ్ముకున్న వారందరికీ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని కోరారు. తనకు సంఘీభావం తెలియజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మా మద్దతు వైఎస్సార్‌సీపీకే

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజలు

ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి అలజంగి జోగారావుకు పార్టీ టికెట్ ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. తమ పూర్తి మద్దతును తెలియ చేయడమే కాకుండా మీ ద్వారా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. కార్యక్రమంలో మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

స్పష్టంగా జ్వర నిర్ధారణ నివేదికలు

• డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు



ఏస్ఎస్‌హెచ్ఎస్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహన్ రావు

పార్వతీపురంటౌన్: జ్వర నిర్ధారణ పరీక్షల నివేదికలు స్పష్టంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్ రావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా ఆస్పత్రిలో జనరల్ ల్యాబ్, డెంగీ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను (ఏస్ఎస్‌హెచ్) వైద్య బృందంతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో వచ్చిన వారికి వైద్యుల సూచనల మేరకు ల్యాబ్‌లో చేపడుతున్న మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షల వివరాలు, నివేదికలను రికార్డుల్లో పరిశీలించారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వివరాలు స్పష్టంగా నమోదు చేసి డీఎంఓ కార్యాలయానికి తెలియజేయాలని కోరారు. అదే వివరాలు ఐహెచ్ఐపీ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో కచ్చితంగా నమోదు చేయాలని ల్యాబ్ సిబ్బందిని ఆదేశించారు. డెంగీ నిర్ధారణ పరీక్షల పరికరాన్ని పరిశీలించి నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రెండు డెంగీ నిర్ధారణ పరీక్ష (ఎస్ఎస్‌హెచ్) కేంద్రాలున్నాయని, పార్వతీపురంలో ఒకటి, రెండోది పాలకొండ ప్రాంతీయ ఆస్పత్రిలో ఉందన్నారు. క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది డెంగీ ఎన్ఎస్-1 కిట్లు ఉపయోగించి ఆ జ్వర లక్షణాలున్న వారికి పరీక్షలు నిర్వహిస్తారని, అందులో పాజిటివ్‌గా వస్తే ఆ పరిధిలో ఉండే సెంటినల్ సర్వలెన్స్ ఆస్పత్రి (ఎస్ఎస్‌హెచ్)కి వారి నమూనాలు పంపిస్తామని, అక్కడ ఎలిసా, ఐజీఎం నిర్ధారణ పరీక్షలు చేపట్టి అందులో పాజిటివ్‌గా వస్తే డెంగీగా నిర్ధారిస్తారని చెప్పారు. అనంతరం వార్డులో జ్వర లక్షణాలున్న వారిని సందర్శించి ఆరోగ్య పరిశీలన చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం సబ్ యూనిట్ అధికారి సీహెచ్. ధనుంజయరావు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిర్లి యాత్రకు పోటెత్తిన భక్తులు



వీరఘట్టం: సిర్లి యాత్రకు పోటెత్తిన భక్తులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని వీరఘట్టం సాయినగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సిర్లి యాత్ర ఉత్సవాలు మంగళవారం ముగిసాయి. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలకు చివరి రోజు అధిక సంఖ్యలో భక్తులు హాజరై యల్లమ్మ, పోతన్నలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో సాయినగర్, బార్నాల వీధి రోడ్లు రద్దీగా మారాయి. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్.ఐ ఫకృద్దీన్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిర్లి ఎల్లమ్మకు మొక్కుల చెల్లింపు



భామిని: ఎల్లమ్మ తల్లికి మొక్కులు తీర్చడానికి వెళ్తున్న భక్తులు

భామిని: మండలంలోని నేరడి-బి సిర్లి యల్లమ్మ సన్నిధిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యల్లమ్మ తల్లి ఉత్సవాలు ముగింపుగా భక్తులు ప్రత్యేకంగా మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్రా - ఒడిశా గ్రామాల నుంచి భక్తులు జోగిలు తెచ్చి సమర్పించారు. మహిళలు ఘటాలతో ముర్రాటలు పోసి సంబరాలు చేసి సాంప్రదాయ మొక్కులు సమర్పించారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు



గరుగుబిల్లి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఆరాతీస్తున్న తహసీల్దార్ జయ

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఫ్లయింగ్ స్క్వాడ్ కె.కె.సింహాచలం సూచించారు. మండలంలోని ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం, మండ, టిక్కబాయి, ఇరిడి, కేదారిపురం గ్రామ సచివాలయాలు, ఆయా గ్రామాల వీధులను ఆయన మంగళవారం సందర్శించి, రాజకీయ ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు ఉన్నవీ లేనివీ పరిశీలించారు, ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా రాజకీయ ప్రచార ఫ్లెక్సీలు, పోస్టర్లు ఎక్కడ కనిపించినా వాటిని తొలగించాలన్నారు. రాజకీయ నేతల ఫొటోలు, విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం సీఎం, పీఎం, ఇతర రాజకీయ నేతల ఫొటోలు ఉండకూడదన్నారు.

గరుగుబిల్లి: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.జయ అన్నారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో ఆమె మంగళవారం పర్యటించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పరిశీలించారు. ఎక్కడైనా రాజకీయ బ్యానర్లు, పోస్టర్లు, కటౌట్లు ఉంటే వెంటనే వాటిని తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయడంతో పాటు శిలాఫలకాలపై కూడా రాజకీయ నాయకుల పేర్లు కనిపించకుండా పేపర్లు అతికించాలన్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఆమె వెంట ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

గరుగుబిల్లి: మండలంలోని మరుపెంట గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఉరిటి నిర్మల, ఎంపీపీ ఉరిటి రామారావు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వర పూజ, మండల మండపారాధన, కంకణధారణ, గ్రామ ప్రదక్షిణ, తిరువీధి వంటి కార్యక్రమాలు చేపట్టారు.

కార్యక్రమంలో అర్చకుడు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏగోటివలసలో ఘనంగా జాతర

సీతానగరం: మండలంలోని ఏగోటివలసలో అమ్మవార్ల జాతర ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండురోజుల పాటు ఘనంగా జరిగింది. గ్రామ దేవత పండగ తెచ్చి 10 సంవత్సరాలు పూర్తి కావడంతో గ్రామపెద్దల సూచనల మేరకు 15 రోజులుగా రాత్రి పూట వీధుల్లో అమ్మవార్ల పూనకంతో ఉన్న వారితో పాటు ఘటాలతో ఊరేగింపు చేశారు. మంగళవారం ఉదయం దేశమ్మతల్లి ఉత్సవం నిర్వహించగా సాయంత్రం బురదాలమ్మతల్లి పాదాలమ్మ, బంగారమ్మ తల్లి ఘటాలను మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ యు.రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుతూ పూజలు చేశామన్నారు. బుధవారం ఉదయం అనుపోత్సవం జరుగుతుందని తెలియజేశారు.

సారా రవాణా, అమ్మకాలపై కఠినంగా వ్యవహరిస్తాం

• ఏఈఎస్ జీవన్ కిశోర్



స్వాధీనం చేసుకున్న సారాతో ఏఈఎస్ జీవన్ కిశోర్, సిబ్బంది

పార్వతీపురం టౌన్: సారా రవాణా, అమ్మకాలు, తయారీపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్ఈబీ ఏఈఎస్ జీవన్ కిశోర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం మండలంలోని బాలగుడబ గ్రామంలో సారా రవాణాపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలగుడబలో నిర్వహించిన దాడుల్లో 180 లీటర్ల సారాను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన బంగారు కృష్ణ ఒడిశా రాష్ట్రం నుంచి సారా అక్రమ రవాణా చేస్తున్న సమయంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో సారా రవాణా అమ్మకాల సమాచారం ఉంటే తక్షణమే ఎస్ఈబీ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ సింహాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సిరుల పోతన్న జాతర

కురుపాం: మండల కేంద్రంలో సిరుల పోతన్న జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్థానిక గౌడు వీధిలోని పోతన్న ఆలయానికి భక్తులు చేరుకుని, విశేష పజలు చేశారు. పట్టణ వాసులతో పాటు పరిసర గ్రామాలైన శివ్వన్నపేట, మంతినివలస, పూతికవలస, సీతంపేటల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు.

పార్వతీపురంలో విశేష హోమం



ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా విశేష హోమంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో 250 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న నూతన ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిప్రతిష్ట, విశేషహోమాన్ని పట్టణ గ్రూపు దేవాలయాల ఈఓ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ చారిత్రక శ్రీ సీతారామస్వామి ఆలయంలో అంజనేయ ఉపాసకుడు బ్రహ్మ శ్రీ శ్రీనివాస శర్మ, ప్రముఖ యజ్ఞకర్తతో పాటు రుత్విక్కుల వేదమంత్రోచ్చారణల మధ్య మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో మజ్జి రామం బ్రదర్స్ పాల్గొంటారని, అలాగే ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మంటపాన్ని గౌరీశంకర బాల కుటుంబ సభ్యులు ప్రారంభిస్తారని చెప్పారు.

ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి

సీతానగరం: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం శ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మండల ఎన్నికల పరిశీలకులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గృహాలపై కట్టిన పార్టీ జెండాలు, గోడలపై ఇంటియజమానులు అతికించిన స్టిక్కర్లు, వాల్‌పోస్టర్లను బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తక్షణమే తొలగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించాలని, రాజకీయ నాయకులతో కూడిన పత్రాలను తక్షణమే తొలగించాలని సూచించారు. ఇప్పటికే పోలీసుల సహకారంతో ఇళ్లలో ఉన్న జెండాలు, స్టిక్కర్లు తొలగించామని, ఇంకా ఎవరి ఇళ్లలో ఉన్నా స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎంవీ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్, మండలపరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

కర్రివలసలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



పాచిపెంట:

పాచిపెంట ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని పలు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు . పోలీసులు, ప్రత్యేక బలగాలతో కలిసి కర్రివలస గ్రామంలో మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ చేశారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అందరూ బాధ్యతగా నడుచుకోవాలని ఎస్సై ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కర్రివలసలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

కళావతిని గెలిపించి జగనన్న రుణం తీర్చుకుంటాం

పాలకొండ:

పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యేగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు విశ్వాసరాయి కళావతికి మూడవ సారి టికెట్ కేటాయించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సంబరాలు చేశారు. ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన కళావతిని మూడవసారి ఎమ్మెల్యేగా చేసి హ్యాట్రిక్ కొడతామని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు పలు కార్యక్రమాలను పట్టణంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సారథ్యంలో అంతా కలసికట్టుగా పనిచేస్తామని ప్రకటించారు. పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ రావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రణస్థలం రాంబాబు, వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, నాగవంశపు కార్పొరేషన్ డైరెక్టర్ నల్లి శివప్రసాద్, జేఏసీ మండల కన్వీనర్ కోట అజయ్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలో జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యేను గెలిపించి జగనన్నకు గిఫ్ట్‌గా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



సిబ్బందికి సూచనలిస్తున్న పీఓ కల్పనాకుమారి

పాలకొండ: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీతంపేట ఐటీడీఏ పీఓ, పాలకొండ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి స్పష్టం చేశారు. పాలకొండ నగర పంచాయతీలో ఆమె పలు పోలింగ్ కేంద్రాలతో పాటుగా కోడ్ అమలును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పక్కాగా చేయాలని తహసీల్దార్ వరహాలను ఆదేశించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని తెలిపారు. పోస్టర్లు, కటౌట్‌లు, బ్యానర్లు ఉంటే తొలగించాలని తెలిపారు. శిలాఫలకాలు ఉంటే వాటిని కూడా మూసివేయాలని కమిషనర్ సర్వేశ్వరరావుకు ఆదేశించారు. ఎంపీడీఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీ కూటమిని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

పాలకొండ: మతోన్మాద బీజేపీ కూటమిని ఓడించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. పట్టణంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ కాలంలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చారని తెలిపారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తీసుకువచ్చారని ఆరోపించారు. ఫెడరల్ వ్యవస్థను నాశనం చేయడంతో బీజేపీ ప్రజావ్యతిరేకత కూడగట్టుకుందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రైతులను ఉసురు పెట్టిందని ఆరోపించారు. ఇటువంటి ప్రభుత్వాన్ని సాగనంపాలని కోరారు. సమావేశంలో కాద రాము, దూసి దుర్గారావు పాల్గొన్నారు.

నాడు.. నేడు



ఎత్తైన కొండలపై ఉన్న శిలిగాం - ఈతమానుగూడ గ్రామానికి 2019 ముందు కనీస రహదారి లేదు. సగం దూరం వరకు ఉండే రహదారి రాళ్లు తేలిపోయాయి. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఎమ్మెల్యేగా విశ్వాసరాయి కళావతి విజయం సాధించినా ఫలితం లేకపోయింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి కళావతి ఎమ్మెల్యేగా మళ్లీ గెలవడంతో రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే చొరవతో సుమారు రూ.2 కోట్లతో రహదారి నిర్మించారు. ఇప్పుడు ఆ గ్రామ గిరిజనుల రహదారి కష్టాలు తీరాయి. గిరిజనులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. - సీతంపేట



ఈతమానుగూడకు నూతనంగా నిర్మించిన రహదారి